## ఉద్యోగ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

కామారెడ్డి టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇటీవల విడుదల చేసిన ఉద్యోగ ప్రకటనలో దరఖాస్తు చేసుకున్న వారు కళాశాలలో ఉంచిన జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలుపాలని కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నవారికి చెందిన వివరాలు వెబ్‌సైట్ జీఎంసీకామారెడ్డి.కామ్‌లో అందుబాటులో ఉన్నాయని లేదంటే కళాశాల నోటీస్‌బోర్డుపై ఉన్న లిస్టును పరిశీలించి అభ్యంతరాలు ఉంటే ఈనెల 7లోపు కార్యాలయంలో అందించాలని సూచించారు.



# ధరణి దరఖాస్తులకు.. మోక్షం!

- దరఖాస్తుల పరిష్కారానికి అదనపు కలెక్టర్, ఆర్డీవోలకు బాధ్యతలు
- తహసీల్దార్ సైతం పరిష్కరించే అవకాశం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జిల్లాలో పెండింగ్‌లో 3,514 ధరణి దరఖాస్తులు
- గత ఆరు నెలల క్రితం 1300ల దరఖాస్తుల పరిష్కారం
- ఇప్పటికీ ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల్లో ఎక్కువ ధరణి సమస్యలే

కామారెడ్డి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం మరింత వేగవంతం చేసింది. ధరణి పోర్టల్‌లో భూ సమస్యలు పరిష్కరించే అధికారం ఇప్పటి వరకు కలెక్టర్‌లకు మాత్రమే ఉండేది. ప్రస్తుతం ఆ అధికారాలను విభజించారు. సమస్యల ప్రతిపాదికన పరిష్కరించే బాధ్యతలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ), ఆర్డీవో, తహసీల్దార్‌లకు అప్పగించారు. ఇప్పటి దాకా కలెక్టర్ వద్దే అధికారాలు ఉండడంతో భూ సమస్యలు పేరుకపోతున్నాయని ప్రభుత్వం నియమించిన ధరణి కమిటీ గ్రహించి దరఖాస్తులను పరిష్కరించేందుకు ఆయా స్థాయిలో ఉండే అధికారులకు అధికారాలను అప్పగిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులన్నీ ఆయా స్థాయిలో సులభంగా పరిష్కరించే అవకాశం లభించనుంది. గత 6 నెలల క్రితం ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం పక్షం రోజుల పాటు రెవెన్యూ అధికారులతో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఆ స్పెషల్ డ్రైవ్‌లో కొన్ని పరిష్కారం కాగా మరికొన్ని దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

### పెండింగ్‌లో 3,514 ధరణి దరఖాస్తులు

జిల్లాలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల్లో కొన్నింటికి పరిష్కారం లభిస్తోంది. ఆరు నెలల కిందట ధరణి సమస్యలపై రెవెన్యూ శాఖ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ఇందులో జిల్లాలో కొంత మేర ధరణి సమస్యలను పరిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా 4,861 ధరణి దరఖాస్తులు భూ సమస్యలపై రాగా ఇందులో 1,345 దరఖాస్తులను స్పెషల్ డ్రైవ్ సమయంలో పరిష్కరించారు. మిగితా 3,514 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో ఎక్కువగా పాస్ పుస్తకాల్లో తప్పుల సవరణకు 2,457 దరఖాస్తులు ఉన్నాయి. వీటిలో 308 దరఖాస్తులను పరిష్కరించారు. మిగితా 2,149 పెండింగ్‌లో ఉన్నాయి. గ్రీవెన్స్ ల్యాండ్ మ్యాటర్స్ సంబంధించి 1,020 దరఖాస్తులు ఉండగా ఇందులో 582 పరిష్కరించగా 438 పెండింగ్‌లో ఉన్నాయి. నిషేధిత భూములకు పట్టా పుస్తకాల జారీకి 601 దరఖాస్తులు రాగా ఇందులో 18 పరిష్కరించగా 583 పెండింగ్‌లో ఉన్నాయి. పాస్‌పుస్తకం లేకుండా వారసత్వ బదిలీ కోసం 242దరఖాస్తులు రాగా 129 పరిష్కరించగా 113 పెండింగ్‌లో ఉన్నాయి. మ్యూటేషన్‌ల కోసం 201 దరఖాస్తులు రాగా 157 పరిష్కరించగా 44 పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టు కేసులు 145 ఉండగా ఇందులో 58 పరిష్కరించగా 87 పెండింగ్‌లో ఉన్నాయి. పట్టా పాసుపుస్తకం లేకుండా నాలా కన్వర్షన్ కోసం 113 దరఖాస్తులు రాగా 48 పరిష్కరించగా 65 పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టు కేసులకు పట్టాపుస్తకాల జారీకి 40 దరఖాస్తులు రాగా 23 పరిష్కరించగా 17 పెండింగ్‌లో ఉన్నాయి. నాలా మార్పిడికి 27 దరఖాస్తులు రాగా 20 పరిష్కరించగా 7 పెండింగ్‌లో ఉన్నాయి. అమలు చేసిన జీపీఏకు 15 దరఖాస్తులు రాగా 4 పరిష్కరించగా 11 పెండింగ్‌లో ఉన్నాయి.

### అదనపు కలెక్టర్, ఆర్డీవోలు పరిష్కరించేవి

కలెక్టర్‌తో సంబంధం లేకుండా ఇకపై అదనపు కలెక్టర్ వద్ద ఐదు రకాల సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంది. ధరణిలో నాలుగు మాడ్యుల్‌ల ద్వారా వచ్చే దరఖాస్తులను అదనపు కలెక్టర్‌లు పలు సూచనలు పాటించాల్సి ఉంటుంది. మొదట దరఖాస్తును తహసీల్దార్ పరిశీలించి ఆర్డీవోకు పంపించాలి. అనంతరం ఆర్డీవో పరిశీలించి ఆయా సమస్యల పరిష్కారం కోసం అదనపు కలెక్టర్‌కు పంపిస్తారు. తహసీల్దార్, ఆర్డీవోలు చేసిన సిఫారస్‌లను పరిశీలించిన తర్వాత సమస్యలను పరిష్కరించడం లేదా రిజెక్ట్ చేయడం చేస్తారు. ఒకవేళ రిజెక్ట్ చేస్తే దరఖాస్తుదారునికి స్పష్టమైన వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. యాజమాన్య హక్కు బదిలీ దరఖాస్తులు (టీఎం3-మ్యుటేషన్), కోర్టు కేసులతో ముడిపడి పాస్‌పుస్తకాల కోసం వచ్చే దరఖాస్తులు (టీఎం24), పట్టా పాస్ పుస్తకం లేదా వ్యవసాయేతర భూమిగా మార్చడానికి ఆటంకంగా ఉన్న రికార్డుల్లో గృహం, హౌజ్‌సైట్ అన్ని నమోదైన వాటికి సంబంధించిన దరఖాస్తులు (టీఎం 31), పాస్ పుస్తకంలో తప్పుల సవరణ(టీఎం 33), పేరు వారిపడి దరఖాస్తులు (టీఎం 33), ఆర్డీవో స్థాయిలో దరఖాస్తులు పరిశీలించేవి వారసత్వ బదిలీలకు సంబంధించిన దరఖాస్తులు (టీఎం 4), అసైన్ భూములకు పాస్ పుస్తకాలు లేని దరఖాస్తులు (టీఎం27), వ్యవసాయేతర భూముల మార్పిడికి సంబంధించినవి (టీఎం 27), సర్వే నెంబర్‌లు, డిజిటల్ సంతకాలు దరఖాస్తులు (టీఎం 33).

### ప్రజావాణిలో ఎక్కువగా భూ సమస్యలపైనే ఫిర్యాదులు

భూ రికార్డుల డిజిటలైజేషన్ కోసం గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ధరణి పోర్టల్‌ను అమలులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ ధరణితో జిల్లాలో వేలాది మంది రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. తమ భూ సమస్యలను పరిష్కారం కోసం సంవత్సరాల తరబడి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూ వచ్చారు. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ధరణికి సంబంధించిన దరఖాస్తులే వస్తున్నాయి. ప్రతీ వారం నిరుపేద రైతులు వందల సంఖ్యలో కలెక్టరేట్ వద్ద పడిగాపులు కాస్తుండడం పరిపాటిగా మారింది. తహసీల్దార్ కార్యాలయంలో సమస్యల పరిష్కారం కాకపోవడంతో దూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ధరణి దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టింది.

## రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేనా?

- కొత్త రేషన్ డీలర్లను నియమించిన అధికారులు
- రేషన్ డీలర్లు అవినీతికి పాల్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారుల వినతి

7



## నిరుపేదల సొంతింటి కల నెరవేరేనా?

- ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేదలు
- ప్రతీ గ్రామంలో నిరుపేదలను గుర్తిస్తున్న అధికారులు



7

## సంతకు స్థలం కరువు!

- రోడ్లకు ఇరువైపులా కూరగాయల అమ్మకాలు
- కూరగాయలు కొనేందుకు వచ్చిన ప్రజలతో ట్రాఫిక్ జాం
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

7



# దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

**కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

కామారెడ్డి టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పని చేస్తుందని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని దివ్యాంగుల కోసం 48,446 ధ్రువీకరణ పత్రాలను అందజేశామని, వివిధ రుణాలు అందిస్తున్నామని తెలిపారు. సుమారు 18 వేల మందికి ప్రతీ నెల రూ.7.26కోట్ల పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వికలాంగులను పెళ్లి చేసుకుంటే ఒక లక్ష ఇన్సెంటివ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 14 మంది స్కూటర్‌లు, 8 మందికి వీల్‌చైర్‌లు అందించామని తెలిపారు. ఎలిన్కో క్యాంపులను నిర్వహించుటకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించుటలో రాష్ట్రంలోనే నాలుగో స్థానంలో నిలిచామని తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి మాట్లాడుతూ సంస్థ దివ్యాంగులకు అండగా ఉంటుందని ప్రభుత్వం దివ్యాంగులకు కావాల్సిన అవసరాలను సమకూరుస్తుందని తెలిపారు. దివ్యాంగులు మరొకరిని ఆదర్శంగా నిలవాలని తెలిపారు. డీఆర్‌డీవో సురేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం మేరకు పెన్షన్‌ల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకం కింద సులువు పనులు కల్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు ఉపాధి హామీ పథకం కింద పనులు రిజిస్ట్రేషన్ కల్పించుటలో రాష్ట్రంలో నాలుగో స్థానం, 64వేల పనులు కల్పించి రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచామని తెలిపారు. అనంతరం దివ్యాంగులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీడబ్ల్యువో చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న కలెక్టర్

### 5న జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి రాక

ఈనెల 5న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా పర్యటన చేస్తున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 5న జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్‌లో యంగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాల కాంప్లెక్స్ శంకుస్థాపన, మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం, లింగంపేట నాగన్న బావి, కామారెడ్డి మున్సిపల్‌లో తాగునీటి వసతుల కల్పన తదితర కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని తెలిపారు. అనంతరం ధాన్యం కొనుగోలు పూర్తిచేసి ట్యాబ్ ఎంట్రీలు త్వరితగతిన చేయాలని రైతులకు వెంట వెంటనే చెల్లింపులు జరిగేలా చూడాలని పౌర సరఫరాల అధికారులకు ఆదేశించారు. సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా సహకార అధికారి రాంమోహన్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్, సహాయ పౌర సరఫరాల అధికారి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్‌లో ముగ్గుల పోటీలు

ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా కామారెడ్డి మున్సిపల్‌లో నిర్వహించిన రంగోలి, మెగా వైద్య శిబిరాన్ని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలను వివరించారు. మెప్మా ద్వారా మహిళ సంఘాల అభివృద్ధికి అందిస్తున్న సహాయ సహకారాలను వివరించారు. కాగా మున్సిపల్ కార్మికులు కమిషనర్ సుజాత బదిలీపై వెళ్లినప్పటి నుంచి తమకు జీతాలు రావడం లేదంటూ కలెక్టర్ వద్ద తమ గోడును వెళ్లబోసుకున్నారు. త్వరగా తమకు జీతాలు అందేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీహరి, డిప్యూటీ ఈఈ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తా



గ్రంథాలయ పరిసరాలను శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచిస్తున్న దృశ్యం

**గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి**

దోమకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం దోమకొండ మండల కేంద్రంలోని గ్రంథాలయంలో రూ.80 వేలతో అన్ని ఉద్యోగాలకు సంబంధించి కాంపిటేషన్ పుస్తకాలను దాతల సహకారంతో అందజేశామన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఇంకేదైన అవసరమైతే తనకు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. గ్రంథాలయానికి మేయిన్‌గేట్ ఏర్పాటుకు దాత చంద్రయ్యగారి అనంత్‌రెడ్డి ముందుకురావడం అభినందనీయమన్నారు. పుస్తకాల దాతలు తిర్మల్‌గౌడ్, నర్సయ్య, శంకర్‌రెడ్డి, శ్రీకాంత్‌లను శాలువాతో సన్మానించి అభినందించారు. గ్రంథాలయం ఆవరణలో మురుగువాసన వస్తుందని పాఠకులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పరిసరాలను ఆయన పరిశీలించి గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదగిరి, బిల్ కలెక్టర్ కిషన్‌లతో మాట్లాడి పరిసరాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా సంబంధిత వ్యక్తులకు పైపులైను వేసుకునేలా చర్యలు చేపట్టి గ్రంథాలయంలో పాఠకులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. దోమకొండ, భిక్కనూర్, బీబీపేట గ్రంథాలయాల్లో జిల్లా కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు ఇలియాస్ రూ. 50వేలతో వైఫై కనెక్షన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. మొదటిసారిగా మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన గ్రంథాలయ శాఖ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డిని బుధవారం తన చాంబర్‌లో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, డీఎల్‌పీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులతో కలసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఐరేని నర్సయ్య, డీసీసీ కార్యదర్శులు తాటిపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై చిరుత ప్రత్యక్షం



దగ్గి జాతీయ రహదారిపై కూర్చున్న చిరుత

సదాశివనగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చిరుత పులి జాతీయ రహదారిపై ప్రత్యక్షం కావడంతో వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురైనా సంఘటన సదాశివనగర్ మండలంలోని దగ్గి అటవీ ప్రాంతంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. కామారెడ్డి రేంజ్ కల్వరాల్ బీట్ పరిధిలోని దగ్గి అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై చిరుతపులి కూర్చుండిపోయింది. చిరుతను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో చిరుత రోడ్డుపై ఆగిపోయిందని స్థానికులు, వాహనదారులు వాహనాలను ఎక్కడివక్కడే నిలిపి సెల్‌ఫోన్‌లో సెల్ఫీలు తీసుకున్నారు. కొద్దిసేపు అనంతరం చిరుత నెమ్మదిగా అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోవడంతో వాహనదారులు రాకపోకలను కొనసాగించారు. ఈ సమాచారం అందుకున్న కామారెడ్డి రేంజ్ అధికారి రమేష్, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీధర్, సెక్షన్ అధికారి ముబారక్ అలీ, బీట్ ఆఫీసర్ గోపాల్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి చిరుత వేలిముద్రలను పరిశీలించారు. ఈ ప్రాంతంలోని చుట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా రేంజ్ అధికారి సూచించారు.



విద్యుత్ కాంతులతో ముస్తాబైన

## జిల్లా పోలీసు కార్యాలయం

కామారెడ్డి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.. ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన విజయోత్సవాలను ప్రతిఘటిస్తూ ఆయా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయాన్ని రంగు రంగుల విద్యుత్ కాంతులతో మంగళవారం అలంకరించారు. దీంతో ఇలా పోలీసు కార్యాలయం మూడు రంగుల జాతీయజెండా మాదిరిగా విద్యుత్ కాంతులతో వెలిగిపోతోంది.

# కేకేవై హైవే పనులను చేపట్టాలని మంత్రికి వినతి

- కేంద్ర మంత్రితో చర్చిస్తానన్న మంత్రి

కామారెడ్డి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రహదారుల నిర్మాణ పనులు, ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలను, కొత్త రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంత్రితో చర్చించి నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి వరకు గతంలో ప్రతిపాదించిన కరీంగనర్- కామారెడ్డి- ఎల్లారెడ్డి(కేకేవై) జాతీయ రహదారి నిర్మాణ పనులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని పనులు చేపట్టాలని మంత్రిని కోరారు. కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి వరకు కేకేవై జాతీయ రహదారి మంజూరైనా సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉందని రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఎమ్మెల్యే మంత్రికి వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరితో చర్చించి కేకేవై పనులకు నిధులు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

# ఉమ్మడి జిల్లా అంతటా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం



నందిపేటలో దివ్యంగులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు



నవీపేటలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో



కమ్మర్‌పల్లిలో..

వేల్పూర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలోని విద్యావనరుల కార్యాలయంలో మంగళవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగులకు ప్రభుత్వం ద్వారా అందే సదుపాయాలు, సౌకర్యాలను ఎంపీడీవో బాలకిషన్, ఎంఈవో రేణుకలు వివరించారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకా లను అర్హులైన వికలంగులు వినియోగంచుకోవాలని వారు సూచించారు. వికలాంగుల పిల్లలు ఎందులో కూడా తక్కువ కారని, వారికి అన్ని విధాలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. వికలాంగులకు నిర్వహిం చిన వివిధ ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు శైలజ, మౌళిక, ఫిజియోథె రపీస్ట్ అరుణ, కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజన్న, తదితరులు ఉన్నారు.

**ఎడపల్లి:** ఎడపల్లి మండల కేంద్రంలో గల భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల దివ్యాంగులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. దివ్యాంగ విద్యార్థులకు క్రీడలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఇంచార్జీ మండల విద్యాధికారి సాయిలు, ఉపాధ్యాయులు దివ్యాంగుల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**నందిపేట:** నందిపేట మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మండల ప్రత్యేక అధికారి జగన్నాథచారి, ఎంపీడీవో శ్రీనివాస్ రావు, మండల తహసీల్దార్ రాజ్‌కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు నాయకులు కిషన్, భూషణ్; రమేష్, భవిత కేంద్రం టీచర్‌లు సురేష్, స్వప్న, ఎంఆర్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**నవీపేట:** మండల కేంద్రంలోని దర్యాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో డీఈవో అశోక్, జిల్లా సమ్మిళిత విద్యకోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు, ఎంఈవో అశోక్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, మండల పీఆర్‌టీయూ అధ్యక్షులు భూమయ్య, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**రెంజల్:** మండలంలోని సాటాపూర్ గ్రామంలో గల భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులకు క్రీడలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, నీలా కాంప్లెక్స్ హెచ్‌ఎం శంకర్, విజయ్ కుమార్, ముత్యామ్మ, భూమయప్ప, సాగర్, రవి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కమ్మర్‌పల్లి:** దివ్యాంగుల లోని ప్రతిభను వెలికి తీయడమే ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం అని కమ్మర్‌పల్లి ఎంఈవో ఎన్ ఆంధ్రయ్య అన్నారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలోని భవిత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతు దివ్యాంగులను సకలాంగులుగా తీర్చిదిద్దడానికి భవిత పాఠశాల ద్వార అనేక కార్యక్రమాలను చేపడుతున్నదని అన్నారు. దివ్యాంగులను భవిత పాఠశాకు తీసుకువస్తున్న వారి తల్లిదండ్రులకు ప్రయాణ భత్యంతో పాటు అలవెన్సులు అందజేస్తు అనేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భవిత పాఠశాల హెచ్ ఎం సీహెచ్ బాలయ్య, డిక్టర్ విశ్వనాథ్, బి మధుశేఖర్, మండల పీఆర్టీయూ అద్యక్షుడు చంద్రశేఖర్, రాజేశ్వర్, శ్యామల, సీఆర్పీలు అంజయ్య రాజేష్, ఎం అంజయ్య, సురేందర్, ప్రవీన్, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు అటలు, పాటల తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు

**బాన్సువాడటౌన్:**పట్టణంలోని భవిఇత భవన్‌సెంటర్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పిల్లలకు ఆటపోటీలను నిర్వహించారు. అదేవిధంగా తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్నినిర్వహించారు.ఆటపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల్‌నోడల్ అధికారి విజయ్, ఎంఐఎస్ భానుప్రసాద్,ఉపాధ్యాయులు వసంత్‌కుమార్,అనిల్‌కుమార్ తదితరులున్నారు.

**జక్రాన్‌పల్లి:** జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో విద్యావనరుల కేంద్రంలో సమగ్ర శిక్ష విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం దివ్యంగ విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. అనంతరం గెలుపొందిన దివ్యంగ విద్యార్థులకు ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎంఈవో శ్రీనివాస్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, లింగన్న, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆర్మూర్‌టౌన్:** పట్టణంలోని బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం అంత ర్జాతీయ దివ్యంగుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దివ్యంగుడైన గుగులోత్ తిరుపతినాయక్‌ను పట్టుశాలువతో సన్మానించారు. దివ్యంగులకు తగిన ప్రాధాన్యతను ఇచ్చి వారి రిజర్వేషన్‌లలో ఇబ్బందులు కలుగకుండా సహకరిస్తామని, రాజకీయాల్లో సైతం తమ శక్తి సామార్థ్యాలు నిరుపించుకునేలా ప్రోత్సహిస్తామని బీజేపీ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్, పట్టణ ప్రధానకార్యదర్శి పులి యుగందర్, దోండి ప్రకాష్, కలిగోట ప్రశాంత్, ఉదయ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో..



ఎడపల్లిలో..



వేల్పూర్‌లో..

## రెంజల్ కస్తూర్బా గాంధీ పాఠశాల తనిఖీ



రెంజల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అశోక్

రెంజల్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను మంగళవారం డీఈవో అశోక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందించే ఆహారాన్ని వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వంట గదిలో భద్రపర్చిన కూరగాయలను పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వంట చేపడుతున్న సిబ్బందిని అభినందించారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సిలబస్ ఎంత వరకు పూర్తయిందని అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి మెరుగైన విద్యను అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలన్నారు. ఆయన వెంట ప్రత్యేక అధికారిణి శ్యామల, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

## అధికారుల సూచనలు పాటించాలి



జన్నేపల్లి రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్

నవీపేట,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్ కోరారు. మంగళవారం మండలంలోని జన్నేపల్లి రైతు వేదికలో జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన రైతులందరికీ 2లక్షల రూపాయల రుణమాఫీని అమలు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. యాసంగి పంటల సాగుకు సంబంధించి రైతులతో మాట్లాడి వారికి తగిన సూచనలు చేశారు. అంతకు ముందు మండలంలోని నాగేపూర్‌లో యాసంగి పంటల సాగుకు సంబంధించి రైతులతో మాట్లాడి సెల్ఫీ ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో ఏవో నవీన్ కుమార్, సంజీవ రావు, వీరేందర్ రావు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## తొమ్మిదేళ్ల రాక్షస పాలనకు చరమగీతం



మాట్లాడుతున్న రాష్ట్ర కోఆపరేటీవ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి

భీమ్‌గల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొమ్మిదేళ్ళ నిర్బంధ రాక్షస పాలనకు కాంగ్రెస్ పార్టీ చరమగీతం పాడిందని రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు స్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పదేళ్ల కేసీఆర్ హయంలో కల్లబోల్లి మాటలతో నిర్బంద పాలనతో ప్రజలు విసుగుచెందారని, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరంలో సంక్షేమ ఫలాలను అందించడం ప్రజల మొహంలో చిరునవ్వు చూస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళలు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. కానీ కేంద్రంలో మోదీ రాష్ట్రంలో కేసీఆర్ 410 ఉన్న సిలిండర్‌ను 2024వరకు రూ.1200వరకు పెంచి రాష్ట ప్రజలపై పెనుభారం మోపారన్నారు. ఆరోగ్యశ్రీని కేసీఆర్ అపహస్యం చేశారని కానీ కాంగ్రెస్ పార్టీ ప్రజారక్షణ కోసం రెండు లక్షల ఉన్న ఆరోగ్యశ్రీని రూ.5లక్షలకు పెంచి ఆదుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ సన్నరకానికి అందిస్తున్న బోనస్‌పై రైతులను అయోమయానికి గురి చేసి నష్టపోయే విధంగా చేసిన ఘనత బీఆర్‌ఎస్ నాయకులదన్నారు పదేళ్ళ కాలంలో బీఆర్‌ఎస్ రూ.400కోట్ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించగా గడిచిన ఒక్క ఏడాదిలోనే రూ.887కోట్లు అందించి ప్రజా ప్రభుత్వంగా ముందుకు పోతుందన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు స్వామి, కాంగ్రెస్ నాయకులు కన్నె సురేందర్, కుంట రమేష్, గోపాల్‌నాయక్, నాగేంద్ర, చరణ్, రాజు, శివ్వ అశోక్, సుంకరి సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను అమలు పరుస్తున్న ఘనత కాంగ్రెస్‌దే

● బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి

బోధన్‌రూరల్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు పరుస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందేనని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా మంగళవారం బోధన్ మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, మెప్మా శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకట నారాయణ, ఏఈ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు శరత్ రెడ్డి, పిట్ల సత్యం, శ్రీకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## రుద్రూరులో దొంగల బీభత్సం



వైన్స్ వెనుకల రేకులు కట్ చేసిన దృశ్యం

కోటగిరి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలో సోమవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. వైన్స్ షాపులో, అంగన్ బజార్‌లోని షేక్ వహీద్ కిరాణ షాపులో, ఓ హోటల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. వైన్స్ షాపు వెనుక భాగాన రేకులను కత్తిరించి లోపలికి చొరబడ్డారు. వైన్స్‌లో మందు బాటిళ్లతో పాటు సుమారు రూ.60వేల నగదును చోరీ చేశారు. కిరాణ షాపులోనూ గోడను పగులగొట్టి సిగరేట్ డబ్బాలు, సుమారు 5వేల రూపాయల నగదు చోరీ చేశారు. అనంతరం హోటల్‌లోనూ చొరబడ్డారు. బాధితులు ఉదయం తమతమ షాపులను పరిశీలించే సరికి వస్తువులు చిందర వందరగా పడి ఉండడంతో పాటు నగదు మాయమవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాలను రుద్రూరు సీఐ కృష్ణ, ఎస్‌ఐ సాయన్నలను పరిశీలించి కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

## యువతి ఆత్మహత్య

బోధన్‌రూరల్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగెం గ్రామానికి చెందిన సుంకరి మనీషా(18)అనే యువతి జీవితంపై విరక్తి చెందిన ఆత్మహత్య చేసుకుందని బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం యువతికి చిన్నతనం నుంచి తల్లిదండ్రులు లేకపోవడంతో మనస్థాపం చెంది జీవితంపై విరక్తితో సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

● 13మంది పేకాట రాయుళ్ల అరెస్టు

బోధన్‌రూరల్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని సాలంపాడ్ గ్రామంలో రహస్య స్థావరంలో పేకాట ఆడుతున్న పేకాట రాయుళ్లను మంగళవారం సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి పేకాట రాయుళ్లను పట్టుకున్నట్లు బోదన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. పేకాట స్థావరంపై దాడి చేయగా 13మంది పేకాట రాయుళ్లను పట్టుకుని 59,400రూపాయలను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. పేకాట ఆడిన వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎవరైనా పేకాట ఆడిన, పేకాట నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన వీరుడు



ఎల్‌బీనగర్‌లో నివాళి అర్పిస్తున్న బాన్సువాడ మలిదశ ఉద్యమకారులు



నందిపేటలో..

బాన్సువాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమానికి ఊపిరి పోసి తెలంగాణ రాష్ట్రం సాధించేందుకు ఆత్మ బలిదానం చేసుకున్న వీరుడు దాసోజు శ్రీకాంత్ చారి అని బాన్సువాడ మండల మలిదశ ఉద్యమకారులు కొనియాడారు. మంగళవారం బాన్సువాడ మండల మలి దశ ఉద్యమకారుల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ చౌరస్తాలో తెలంగాణ మలి దశ ఉద్యమకారుడు దాసోజు శ్రీకాంత్ చారి 15వ వర్థంతి సందర్భంగా బాన్సువాడ మలి దశ ఉద్యమకారుల పక్షానా వారికి నివాళులర్పించడం జరిగింది. నేను సైతం ప్రపంచానికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను అని శ్రీశ్రీ అన్నట్లు తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసి ఉద్యమానికి ఆయువు పోసిన అమరుడా నీ త్యాగాలను మేము మరువం అమరుడా శ్రీకాంతుడా ఆవేశం ఆపుకోలేక ఆక్రోశం చూపియలేక ఎంతో గుండె ధైర్యంతో నీకు నివే ఆహుతైనవాడ 60ఏళ్ల తెలంగాణ పోరాటానికి దారి చూపినవాడు శ్రీకాంతాచారి అని మలి దశ ఉద్యమకారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉడుత గంగాధర్, ఎర్రవట్టి సాయిబాబా, గంజివర్ చందు, దండు విజయ్, భీమా నాయక్, రాజు,కృష్ణ, మారుతి, పవన్, తదితరులు పాల్గొన్నారు.

**నందిపేట:** నందిపేట మండల కేంద్రం లోని పాతబస్టాండ్ సమీపంలో మంగళవారం తెలంగాణ మలివిడత ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతచారి వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రీకాంతచారి ప్రాణత్యాగాల వల్ల తెలంగాణ రాష్ట్రం ఏర్పడిం దని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కె.గంగాధర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ హుస్సైన్, మాజీఎంపీటీసీసభ్యుడు మనోజ్‌రావు, గంగా ధర్, నాయకులు సురేష్, కొత్తూరు భాస్కర్, పాశ, తదితరులు ఉన్నారు.

**నవీపేట:** ప్రత్యేక తెలంగాణ సాధనకై మలిదశ ఉద్యమంలో అసువులు బాసిన దాసోజు శ్రీకాంతా చారి 15వ వర్థంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మండల విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో దాసోజు శ్రీకాంతా చారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన పోరాటాని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షులు భూమాచారి, కాళిదాసు, శ్రీనివాస్, శివ, ప్రశాంత్, వినోద్, ప్రకాష్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

**బీర్కూర్:** బీర్కూర్ మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు శ్రీకాంత్ చారికి ఘన నివాళులర్పించారు. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మంగళవారం గాంధీచౌక్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు చేరుకున్నారు. శ్రీకాంతాచారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం శ్రీకాంతాచారి తన ప్రాణాలను త్యాగంచేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం

నవీపేట,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టేషన్ ఏరియాకు చెందిన ఎల్.రాజేష్(30)అనే వ్యక్తి అదృశ్యమయ్యాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు.రాజేష్ గతంలో పలుమార్లు ఇంటి నుండి బయటకు వెళ్లి రెండు, మూడు నెలలకోసారి తిరిగి వచ్చేవాడని అన్నారు.ప్రస్తుతం ఆరు మాసాల క్రితం బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు. రాజేష్‌కు భార్యఇద్దరుకుమారులు ఉన్నారని,రాజేష్ తల్లికళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## తాగుడుకు బానిసై ఒకరి ఆత్మహత్య

గాంధారి,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):సర్వాపూర్ గ్రామానికి చెందిన ముదెల్లి పోచయ్య (45) ఆత్మహత్యచేసుకున్నట్లు ఎస్ ఐ ఆంజనేయులు తెలిపారు.సర్వాపూర్ జీపీలో వర్కర్‌గా పనిచేస్తున్నాడని గత కొన్ని సంవత్సరాలుగా తాగుడుకు బానిసై డబ్బుల కోసం భార్యనుకూడా వేదించేవాడని, ప్రతీ రోజు కూడా తన భార్యను త్రాగటానికి డబ్బులు అడగగా లేవని భార్య వినోద చెప్పగా తనను కొట్టడంత్తో ఇంట్లో నుంచి వెళ్లి పోయింది.తిరిగి భార్యవినోద ఉదయం వచ్చేసరికి ఉరివేసుకుని ఇంట్లో ఆత్మహత్యచేసుకున్నాడని తెలిపారు. మృతుని భార్య వినోద ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## యువతి అదృశ్యం

లింగంపేట,డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బాణాపూర్ గ్రామానికి చెందిన బెస్త సాయిలు కూతురు అఖిల (19) కని పించకుండా పోయిందని మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేసి నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.సాయిలు భార్యతో కలిసి ఈనెల 2నమాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో విందుకు వెళ్లగా అదే రోజు సాయంత్రం అఖి ల ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని గ్రామంలోను, బంధువుల ఇళ్లలోన వెతికినా ప్రయోజనం లేకపోవడంతో తండ్రిసాయిలు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ధర్పల్లి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామడుగు గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున గ్రామంలో అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్టు తెలుసుకున్న పోలీసులు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

## అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



పచ్చలనడ్కుడలో చెక్కులను అందజేస్తున్న అన్వేష్‌రెడ్డి

వేల్పూర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): పేద, బడుగు బలహీన వర్గాల రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైనా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందజేసిన అనంతరం రూ2లక్షల రుణమాఫీ చేసినందుకు గాను సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వ హించారు. ఈ సందర్భంగా అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుగు గడ్డం నర్సారెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు టక్కరి గంగాధర్, గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, నాయకులు లింగేశ్వర్, నెహ్రు, గట్టవుతాల నర్సారెడ్డి, భూమన్న, కార్యకర్తలు, తదిరులు పాల్గొన్నారు.

## నాణ్యతతో కూడిన భోజనం అందించాలి

ధర్పల్లి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత పాటించాలని తహసీల్దార్ మాలతి సూచించారు. మంగళవారం మండలంలోని ఒన్నాజీపేట్, వాడి గ్రామాల్లో అంగన్‌వాడి సెంటర్‌లను, ప్రభుత్వ పాఠశాలలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు.మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెను ప్రకారం నాణ్యతయుతంగా విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. ప్రతీరోజు భోజనం అందించాలని ఏజెన్సీలకు ఆదేశించారు.

## విశ్వకర్మలు కలిసికట్టుగా ఉండాలి



మాట్లాడుతున్న విశ్వకర్మ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్ మహిపాల్‌చారి

డొంకేశ్వర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి) విశ్వకర్మ సంఘం సభ్యులంతా కలిసికట్టుగా ఉంటే ఎటువంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని విశ్వకర్మ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్ మహిపాల్‌చారి అన్నారు. మంగళవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో విశ్వకర్మ మండల సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం కుటుంబ సర్వేలో ఐదు కులాలకు కలిసి ఒకే కోడ్‌ను కేటాయించాలని విశ్వకర్మ సంఘాలు కోరడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో హర్షం వ్యక్తం చేశారు. కుటుంబసర్వేలో విశ్వబ్రహ్మణ కులంలో వివిధ వర్గాలకు ప్రత్యేకంగా కోడ్ ఇచ్చి లెక్కించడం వల్ల వారి జనాభా చాలా తక్కువగా నమోదు అవుతుందని అన్నారు. విశ్వకర్మ కులస్తులను వేర్వేరుగా లెక్కించడం వల్ల జనాభా సంఖ్య తగ్గి ప్రభుత్వ పథకాలు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, శ్యామ్, నగేష్, అశోక్, రాములు, బ్రహ్మయ్య, చిన్నయ్య, ప్రశాంత్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతాల్లో నిప్పు పెట్టొద్దు

మోస్రా,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మోస్రా మండలంలోని చింతకుంట గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ శిక్షణ అధికారి మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో నిప్పు పెట్టడం వల్ల నిప్పు వలన అడవులు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. నిప్పు వల్ల అడవులలో జీవించే వన్య ప్రాణులు చనిపోతున్నాయన్నారు. అటవీకి నిప్పు పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అడవులను కాపాడి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అటవీ శిక్షణ అధికారి కోటేష్, బీట్ అధికారి హుస్సేన్, హరీష్, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

## బోధన్ అభివృద్ధికి నిధుల మంజూరు

బోధన్‌రూరల్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): బోధన్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ ధర్మపురి అరవింద్ 50లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ చారి తెలిపారు. బోధన్ నియోజకవర్గంపై ఎంపీ అరవింద్‌కు పట్టు ఉందని, బోధన్ నియోజకవర్గం అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. బోధన్ నియోజకవర్గానికి 50లక్షల నిధులు మంజూరు చేసి తీసుకురావడంలో తనవంతు కృషి చేసిన ఎంపీకి బోధన్ బీజేపీ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు విద్యుత్ సమస్యలపై పరిష్కార వేదిక

వేల్పూర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): వేల్పూర్, భీమ్‌గల్ మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం వేల్పూర్ విద్యుత్ ఉప కేంద్రంలో సదస్సు నిర్వహించడం జరుగుతుందని ఆర్మూర్ ట్రాన్స్‌కో డీఈ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సమస్యలపై పరిష్కర వేదిక నిర్వహిస్తున్నట్లు డీఈ తెలిపారు. ఈ అవకాశాన్ని వేల్పూర్, భీమ్‌గల్ మండలాల ప్రజలు, విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

## రైతులను మోసగిస్తున్న ప్రభుత్వం

● రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రైతు పండగ పేరిట రైతులను ప్రభుత్వం మోసం చేస్తుందని రైతు జేఏసీ నాయకులు విమర్శించారు. పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు వి.ప్రభాకర్, ఇట్టెడి లింగారెడ్డిలు మాట్లాడుతూ రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, నాల్గవ విడత ప్రకటించినప్పటికీ 60శాతం కూడా పూర్తి కాలేదని వారన్నారు. ఈ కార్యక్రమంలో బి.దేవరాం, భూమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


# స్థానిక సంస్థల నిధులకు గ్రహణం!



● పనులు పూర్తి చేసినా బిల్లులు పెండింగ్‌లోనే.. ● నిధుల లేమితో కుంటుపడిన గ్రామీణాభివృద్ధి పనులు
● కొత్త ప్రభుత్వంలో మంజూరు కాని నిధులు ● చేసిన పనులకు బిల్లులు లేక లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఖిల్లా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల నిధులకు గ్రహణం పట్టుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి జిల్లా పరిషత్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు కేటాయిస్తారు. ఇలా వచ్చిన నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, పాఠశాలల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, గ్రామీణ పారిశుధ్యం పనులు, వైద్య, విద్య కోసం నిధులు వెచ్చిస్తారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా స్థానిక సంస్థలకు రావల్సిన నిధులు గత కొన్నేళ్లుగా రాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడింది. గత పదేళ్లుగా గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు గాను ఒక్కో మండలంలో సుమారు 3 నుంచి 5 కోట్ల రూపాయల వరకు పనులు పూర్తిచేశారు. ఇందులో ప్రతీ మండలానికి సుమారు కోటి రూపాయలకు పైగా నిధులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు, కాంట్రాక్టర్ల ద్వారా తెలిసింది. కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక నిధులు (ఫైనాన్స్) జిల్లా పరిషత్‌కు రావల్సిన నిధులు గత కొన్నేళ్లుగా రావడం లేదు. పైగా గత ప్రభుత్వంలో యాక్షన్‌ప్లాన్ ద్వారా మంజూరైన వివిధ పనులు పూర్తి చేసినా ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు.2023-24కు గాను కేంద్రప్రభుత్వానికి 3కోట్ల50లక్షల నిధులకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అధికారులు పంపారు. అయితే అందులో నుంచి కోటి 5లక్షల రూపాయలు ఇప్పటికీ రాలేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో గ్రామీణ ప్రాంతాల్లో వివిధ పనులను చేపట్టేందుకు జిల్లా పరిషత్ శాఖాధికారులు 2024- 25 కుగాను 3 కోట్ల 70 లక్షల రూపాయల యాక్షన్‌ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. కానీ ఇంతవరకు ప్రభుత్వం ద్వారా ఎటువంటి నిధులు రాలేదు. దీంతో పనును పూర్తి చేసిన కాంట్రాక్టర్లు అప్పులపాలయ్యారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జిల్లా పరిషత్‌కు రావాలసిన ఎస్ఎఫ్‌సీ నిధులు సైతం మంజూరుకు నోచుకోలేదు. ఈ ఎస్ఎఫ్‌సీ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి పనులు చేపడ్తారు.



### పనులు పూర్తి అయినా పెండింగ్‌లో బిల్లులు

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని ఆయా మండలాల పరిధుల్లో మంజూరైన వివిధ పనులను అధికారులు పూర్తి చేయించారు. పనులు పూర్తయి ఏళ్లు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వాల నుంచి రావాల్సిన బిల్లులు ఇప్పటికీ రాలేదు. దీంతో పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లు బిల్లుల మంజూరు కోసం జిల్లా పరిషత్ కార్యాలయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు కొత్త ప్రభుత్వం మంజూరు చేస్తుందని భావించిన వారికి నిరాశే మిగులుతుంది. గత ప్రభుత్వ హయాంలో పూర్తిచేసిన పనులకు బిల్లులు రాకపోవడం వల్ల పనుల కోసం చేసిన అప్పులు తీర్చలేక కాంట్రాక్టర్లు నానా ఇబ్బంది పడుతున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీ లు చెల్లించక దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అధికారుల చు ట్టూ తిరిగినా ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయన్న ఒకే ఒక్క మాట తప్ప నిధులు ఎప్పుడు వస్తాయో చెప్పలేని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు.

### నిధుల లేమితో కుంటుపడిన గ్రామీణాభివృద్ధి

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావల్సిన నిధులు రాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడింది. గ్రామీణ ప్రాంతాల్లో జిల్లాపరిషత్ ద్వారా వివిధ అభివృద్ధి పనులు చేపట్టేవారు. కానీ గత పదేళ్లుగా జిల్లా పరిషత్ శాఖకు నిధులు మంజూరు కాకపోవడంతో గ్రామాల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది. ఎటుచూసినా గుంత రోడ్లు, శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల భవనాలే కన్పిస్తున్నాయి.

### గామాల్లో లోపించిన పారిశుధ్యం

గ్రామాల్లో పారిశుధ్య పనులు స్తంభించిపోయాయి. జిల్లా పరిషత్‌శాఖ ద్వారా గ్రామాలకు కేటాయించాల్సిన నిధులు రాకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు జరుగడం లేదు. పైగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల కాల పరిమితి ముగియడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయడానికి శ్రద్ధ చూపడంలేదు. ప్రభుత్వం గ్రామాలకు ఇన్‌చార్జీలుగా కేటాయించిన ప్రభుత్వ అధికారులకు అధికారాలు ఉన్నా నిధులు లేకపోవడంతో వారు సైతం అభివృద్ధి పనులు చేయడానికి దృష్టిపెట్టడం లేదు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది.

## రేషన్ బియ్యం అక్రమ రవాణాకు
# అడ్డుకట్ట పడేనా?

● కొత్త రేషన్ డీలర్లను నియమించిన అధికారులు ● అవినీతికి తావు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలంటున్న ప్రజలు



మండలకేంద్రంలో నూతన డీలర్‌ను నియమించిన చౌక ధరల దుకాణం

నసురుల్లాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాలకు అధికారులు ఇంటర్వ్యూ పద్ధతిలో చౌకధరల దుకాణాలకు రేషన్ డీలర్లను నియమించారు. ఇప్పటివరకు ఒక్కో డీలర్‌కు రెండు నుంచి మూడు రేషన్ షాపులు ఉండేవి. అయితే నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత నసురుల్లాబాద్ మండలంలో ఆరు రేషన్ షాపులకు నూతన డీలర్లకు పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి రేషన్ డీలర్లను నియమించింది. అయితే ఇప్పటి నుంచి అయినా అక్రమ రేషన్ బియ్యం రవాణాకు అడ్డుకట్టపడేనా అన్నట్లు నసురుల్లాబాద్ మండల ప్రజలు గుసగుసలాడుతున్నారు. గతంలో మహారాష్ట్ర, కర్నాటక వంటి ప్రాంతాల నుంచి కొనుగోలు చేసుకుని అక్కడికి వెళ్లి విక్రయించే వారని మండల ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా గతంలో కొంత తమంది రైస్ మిల్లుల యజమానులు కూడా ఈ రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేయించి ప్రభుత్వానికి పంపిన దాఖలాలుకూడా ఉన్నాయి.

అయితే ఇప్పటికైనా ఈ అక్రమ రేషన్ బియ్యం తరలింపును నివారించి, నిజమైన నిరుపే దలకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని, ఒకవేళ నూతన డీలర్లు సైతం తమ జేబులను నింపుకొని డబ్బులు దండుకుందామన్న ఉద్దేశంతో పని చేయకుండా అక్రమంగా రేషన్ తరలింపునకు పాల్పడకుండా నిరుపేదలకు అన్యాయం జరుగకుండా చూడాలని నసురుల్లాబాద్ మండల ప్రజలు కోరుకుంటున్నారు. రేషన్‌డీలర్లు అవినీతికి పాల్పడితే అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాపోతున్నారు.

### రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

● ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్



నసురుల్లాబాద్ మండలంలోని ఆయా గ్రామాల రేషన్ డీలర్లు అక్రమంగా రేషన్ బియ్యం తరలించి, రవాణా చేసిన చట్టరీత్యాపరమైన కేసులతో పాటు క్రిమినల్ కేసులు బుక్ చేస్తాం.




ప్రధాన రహదారికి ఇరువైపులా కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

# సంతకు స్థలం కరువు!

● రోడ్లకు ఇరువైపులా కూరగాయల అమ్మకాలు ● కూరగాయాలు కొనేందుకు వచ్చిన ప్రజలు ట్రాఫిక్ జాం
● వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ● పట్టించుకోని అధికారులు

రాజంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పేరుకే మండల కేంద్రంగా ఉంది తప్ప కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. గ్రామంలో ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికి అధికారులు దృష్టిసారించకపోవడంతో రోడ్లపైనే వ్యాపారులు కూరగాయాలు విక్రయిస్తున్నారు. రోజువారి సంతకు కనీస స్థలం కేటాయించలేకపోవడంతో ప్రధానరహదారికి ఇరువైపులా కూరగాయాల విక్రయాలు చేస్తుండడంతో వాటిని తీసుకునేందుకు వస్తున్న ప్రజలతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోతుంది. దీంతో ట్రాఫిక్‌జాం ఏర్పడివాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### కూరగాయలు అమ్మేందుకు సంతలేదు

మండల కేంద్రానికి రోజువారిగా చుట్టుపక్కల గ్రామాల రైతులు కూరగాయాలు అమ్మేందుకు వస్తుంటారు. మార్కెట్‌యార్డు గాని స్థలం గాని లేకపోవడంతో రోడ్డుపైనే ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారం కొనసాగిస్తున్నారు. రోజువారిగా చిన్నగా సాగిన శుక్రవారం మాత్రం పెద్దసంఖ్యలో వ్యాపారం సాగుతుంది.మండల కేంద్రంలోని రైతులతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన బస్వన్నపల్లి, శివాయిపల్లి, తలమడ్ల, ఆర్గోండ,పెద్దయిపల్లి, పొందుర్తి గ్రామాల నుండి రైతులు కూరగాయాలను తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతుంటారు. అయిన ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు లేకోపోవడంతో వ్యాపారం రోడ్డుమీదనే సాగిస్తున్నారు.దీంతో తీవ్ర ట్రాపిక్ జాం ఏర్పడి వాహనాలు కదలలేని పరిస్థితి ఏర్పడుతుంది.

### మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని వినతులు

కొత్తమండలం ఏర్పాటు అయి సంవత్సరాలు గడుస్తున్న కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. రాజంపేట మండలం సగం కామారెడ్డి నియోజకవర్గానికి, మరో సగం ఎల్లారెడ్డి నియోజకవర్గానికి వస్తుంది. ఇద్దరు ఎమ్మెల్యేలు దృష్టిసారించి మార్కెట్ యార్డు ఏర్పాటుచేయాలని విన్నవిస్తున్నారు. మార్కెట్ యార్డును ఏర్పాటుచేస్తే అక్కడే కూరగాయాలు విక్రయించేందుకు రైతులకు వీలుగా ఉంటుందని, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవనే అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

## నిరుపేదల
# సొంతింటి కల నెరవేరేనా?

● ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేదలు ● ప్రతీ గ్రామంలో నిరుపేదలను గుర్తిస్తున్న అధికారులు

తాడ్వాయి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రె స్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లపై పేదలు అనేక ఆశలు పెట్టుకున్నారు. తమ సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంలో నెరవేరు తుందని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. మండల ంలోని ప్రతీ గ్రామంలో ఇళ్లు లేని నిరుపేదలు రేవంత్ సర్కార్ ఇందిరమ్మ ఇల్లు త్వరలో వస్తా యని అనడంతో సొంతింటి కల నెరవేరుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా నే మండలంలో ఇందిరమ్మ కమిటీలను నిరుపేదలను గుర్తించాలని నియమించారు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ప్రతీ గ్రామంలో ఉన్న నిరుపేదలను గుర్తిస్తున్నారు. ఎక్కడ పోయినా ఏ ఉపన్యాసం ఇచ్చిన గ్రామాల్లో ఉన్న నిరుపేదల ప్రజలను గుర్తించి వారికి అండగా ఉంటున్నారు. నిరుపేద కుటుంబాలకు ఇండ్లు చేరే విధంగా సహాయం చేస్తానని మాట ఇస్తున్నారు. ఎమ్మెల్యే ఇచ్చిన మాటతో ఆశావహుల్లో ఇంకా నమ్మకం కుదురుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అభయహస్తం ఆరు గ్యారంటీల పథకంలో సుమారు 10,927 దరఖాస్తులు మండలంలో మొత్తం వచ్చాయి. ఇందులో ఇళ్లు లేని నిరుపేద దరఖాస్తులే ఎక్కువగా ఉన్నాయి. మండలంలో మొత్తం 18 గ్రామాలు ఉండగా ప్రతీ గ్రామంలో వందకుపైగానే ఇళ్లు లేని నిరుపేదల కుటుంబాలు ఉన్నాయి. నిరుపేద కుటుంబాల ఎంపికలో చేతివాటం ప్రదర్శించకుండా పైరవీలు జరగకుండా ప్రతీ గ్రామంలో నిరుపేదలకు ఇల్లు అందేలా చూడాలని ఆయా గ్రామాల నిరుపే దలు కోరుతున్నారు.



అద్దె ఇంట్లో ఉంటున్న ఓ నిరుపేద కుటుంబం

### ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశతో ఉన్నాను..

● చాకలి రాజన్న, స్థానికుడు



15 సంవత్సరాలుగా అద్దె ఇంట్లోనే ఉంటున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం లో తమకు ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశతో ఉన్నాను. ప్రభుత్వం తమకు ఇల్లు మంజూరు చేస్తే నిర్మించుకుంటాను.

### గత 20 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే..

● మహ్మద్ గఫూర్, స్థానికుడు



గత 20 సంత్సరాలుగా ఇల్లు లేకుండా అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. నాకు ఖాళీ స్థలం, ఇల్లు మంజూరు చేస్తే నిర్మించుకుంటాను. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని నమ్మకం ఉంది.





డ్రైనేజీ లేక అస్తవ్యస్తంగా ఉన్న డబుల్ గృహాలు

# ఎన్నాళ్లీ తిప్పలు!?

● డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో కరెంటు కటకట ● మురుగు కాల్వల్లేక అవస్థలు

ఇందల్వాయి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి మండల కేంద్రంలో లబ్ధిదారులకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు అంధకారంలో మగ్గుతున్నాయి. కరెంటు లేక లబ్ధిదారులు చీకటి గృహాల్లోనే నివసిస్తున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారని లబ్దిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి 48 మందికి డబుల్‌గృహాలను మంజూరుచేశారు. గృహాలను ఇచ్చి సంవత్సరం గడిచిన ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి. కరెంటు, డ్రైనేజీ లేక నానా అవస్థలు పడుతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రతీ ఇంటికి విద్యుత్ మీటర్లు ఇవ్వాల్సిన అధికారులు నేటి వరకు ఇవ్వలేదు. ఒకే మీటర్‌తో అన్ని గృహాలకు విద్యుత్ సరఫరా చేయడంతో ఎవరు ఎంత బిల్లు కట్టాలో తెలియక విద్యుత్ బిల్లు అమాంతం పెరిగిపోతుందన్నారు. దీంతో పలు మార్లు విద్యుత్ అధికారులు లైన్ కట్ చేశారు. లబ్ధిదారులు ఏం చేయాలో తెలియక ఎవరికి చెప్పాలో తెలియక చిన్న పిల్లలతో చీకటి గృహాల్లో కాలం వెల్లదీస్తున్నారు. పేరుకు మాత్రమే డబుల్ గృహాలు ఇచ్చారే తప్ప లబ్ధిదారుల సమస్యలు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కలెక్టర్, విద్యుత్ ఉన్నతాధికారులు, తహసీల్దార్‌లను కలిసి వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇందల్వాయి డబుల్ బెడ్‌రూంలలో నివసిస్తున్న లబ్ధిదారులకు విద్యుత్, డ్రైనేజీ సమస్యలు తీర్చాలని అధికారులను వేడుకుంటున్నారు.




### మురుగు కాల్వలు లేక అవస్థలు

డబుల్ ఇళ్లు ఇచ్చి సంవత్సరం దాటిన ఇప్పటివరకు డ్రైనేజీ సరఫరా లేకపోవడంతో ఇళ్ల చుట్టూ మురికినీరు చేరి దుర్వాసన వస్తుందని దోమలు, ఈగలు ఇంట్లోకి చేరి రోగాల బారిన పడుతున్నామని లబ్ధిదారులు అంటున్నారు.

### చీకట్లోనే గడుపుతున్నాం..

● జితేందర్, గ్రామస్థుడు



కరెంటు లేక చీకటిలో నిద్రిస్తున్నాం. మురుగు కాల్వలు లేక పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. దోమలతో రోగాల బారిన పడుతున్నాం. రాత్రిపూట ఇంట్లో ఉండాలంటే చిన్నపిల్లలు భయపడుతున్నారు. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించాలి. మా సమస్యలు తీర్చాలి.

### బడ్జెట్ రాగానే పనులు మొదలు పెడతాం

● ట్రాన్స్‌కో ఏఈ రాజేందర్ వివరణ

గత ప్రభుత్వంలోనే డబుల్ ఇళ్ల కోసం ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైంది. కానీ ఇప్పటి వరకు డబ్బులు రాలేదు. బడ్జెట్ రాగానే పనులు మొదలు పెడతాం.

## సురక్షిత ప్రయాణం కోసమే 'మై ఆటో ఈజ్ సేఫ్'

భిక్కనూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సురక్షితమైన ప్రయాణం, భద్రత కోసమే మై ఆటో ఈజ్ సేఫ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం భిక్కనూరు మండలంలోని జంగంపల్లి వైశ్య ఫంక్షన్‌హాల్‌లో భిక్కనూరు సర్కిల్ పరిధిలోని భిక్కనూరు, రాజంపేట, దోమకొండ, బీబీపేట మండలాలకు చెందిన ఆటోడ్రైవర్లతో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మై ఆటో ఈజ్ సేఫ్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఆటోకు క్యూ ఆర్ కోడ్‌తో అనుసంధానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, ఎస్సై సాయికుమార్, రాజంపేట ఎస్సై పుష్పరాజ్, దోమకొండ ఏఎస్సై సుబ్రమణ్యాచారి, పోలీసు సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

### గోదాంల స్థలాల కోసం అన్వేషణ

నిజాంసాగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహ్మద్‌నగర్ మండల పరిధిలోని బుర్గుల్, కొమలాంచ గ్రామాల్లో గోదాముల నిర్మాణం కోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు మంగళవారం స్థలాల అన్వేషణ చేశారు. 50 వేల మెట్రిక్ టన్నుల గోడౌన్ నిర్మాణానికి 15 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేసేందుకు రెవెన్యూ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు అన్వేషించారు. బుర్గుల్, కొమలాంచ, గున్కుల్ గ్రామాల్లో స్థలాలను పరిశీలించారు. ఫారెస్టు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే అనంతరమే ఈ స్థలాలను గుర్తించడం జరుగుతుందని మహ్మద్‌నగర్ తహసీల్దార్ సవాయిసింగ్ తెలిపారు. స్థల పరిశీలనలో నిజాంసాగర్, పిట్లం మార్కెటింగ్ కమిటీ చైర్మన్ మనోజ్‌కుమార్, మహ్మద్‌నగర్ మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు భూషణ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కాలిక్ తదితరులు ఉన్నారు.

### జిల్లా గెజిటెడ్ అధికారుల కార్యవర్గం ఎన్నిక

మద్నూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లా తెలంగాణ గెజిటెడ్ సహాయ కార్యదర్శిగా శివరాజు, ఉపాధ్యక్షుడిగా జగన్, వినీత్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా రాజా గంభీర్, శివరాజ్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

## మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

బాన్సువాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం రుణాలను అందజేస్తుందని ప్రభుత్వ సలహాదారులు పోచారం, ఆగ్రో చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు అన్నారు. మంగళవారం బాన్సువాడ పట్టణ కేంద్రంలో ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని మాతా శిశు ఆసుపత్రి ఆవరణలో తాత్కాలికంగా నిర్మించే షెడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### బాన్సువాడలో విజయోత్సవాల ర్యాలీ

బాన్సువాడ మున్సిపాలిటీ ప్రజా పరిపాలన విజయోత్సవాలను మంగళవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్‌లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాలయం నుంచి తాడ్కోల్ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున మహిళలు, ప్రజాప్రతినిధులు వివిధ వర్గాల ప్రజలు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఖలేక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అసద్ బిన్ మోసిన్, ఎజాస్, నార్ల సూరి, స్థానిక నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన

ఎల్లారెడ్డి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ పరిధిలోని బీసీ కళాశాల వసతి గృహంలో విద్యార్థులకు మంగళవారం సమాచార హక్కు చట్టం జిల్లా సలహాదారుడు లింగమయ్య సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 సమాచార హక్కు చట్టం వజ్రాయుధం లాంటిదని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి సమాచారం తెలుసుకోవాలన్న తెలుసుకోవచ్చునని, విద్యా హక్కు చట్టం, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## నందివాడలో మధ్యాహ్న భోజనం ప్రారంభం

తాడ్వాయి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నందివాడ గ్రామంలో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించినట్లు ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు భోజనాన్ని అందించకపోవడంతో పై అధికారులకు తెలిపి గ్రామస్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజన నిర్వాహకుడితో మాట్లాడి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రామస్వామి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## బీర్కూర్‌లో జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం

బీర్కూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విద్యార్థులు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని కోరారు. కాలుష్య నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యావరణ కాలుష్యం వల్లకలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రెసిడెన్షియల్ పాఠశాలకు స్థల పరిశీలన

మద్నూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్థలాన్ని సంబంధిత అధికారులు పరిశీలించారు. ఈ పాఠశాల నిర్మాణానికి సుమారు 20 నుంచి 25 ఎకరాల భూమి అవసరం అవుతుందని అధికారులు వెల్లడించారు. ఈనెల 5న రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సాయిలు, రమేష్, హన్మాండ్లు, స్వామి, మహేష్, కుశాల్, సంతోష్, కొండ గంగాధర్, సురేష్ తదితరులు ఉన్నారు.

## డబుల్ బెడ్‌రూం ఇళ్ల స్థల పరిశీలన

తాడ్వాయి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తహసీల్దార్, మండల అభివృద్ధి కార్యాలయం మధ్యలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. ఇందులో హౌసింగ్ ఏఈ సుభాష్, తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తదితరులు ఉన్నారు.



# రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి : జుక్కల్ ఎమ్మెల్యే

నిజాంసాగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బంజేపల్లి గ్రామ రేషన్ షా ప్‌ను మంగళవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రారంభించారు. గత కొన్ని ఏళ్లుగా ఈ రేషన్ షాపును ఇన్‌చార్జి డీలర్లే నిర్వహించే వారు. కొత్తగా ప్రభుత్వం డీలర్లను ని యమించింది. దీంతో బంజపల్లి గ్రామానికి కాజా మొహినుద్దీన్ నియమించడంతో బం జపల్లి కొత్తగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ వి నియోగదారులు నేరుగా రేషన్ షాప్‌కు వెళ్లి ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యాన్ని పొందాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పిట్లం, నిజాం సాగర్ మండలాల మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్, తహసీల్దార్ భిక్షపతి తదితరులు ఉన్నారు.

### డబుల్ బెడ్‌రూంల లబ్ధిదారులకు పట్టాలు అందించేందుకు కృషి

**పిట్లం:** ఎల్లమ్మకుచ్చలో డబుల్‌బెడ్‌రూంలు నిర్మించుకున్న లబ్ధిదారులకు పట్టాలు వచ్చేలా కృషి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాం తారావు అన్నారు. మంగళవారం ఎల్లమ్మ గుట్ట లో డబుల్‌బెడ్ నిర్మించుకున్న గృహాలను ఎమ్మె ల్యే పరిశీలించారు. లబ్ధిదారులు తాము డబుల్ బెడ్‌రూంల స్థలాల్లో స్వయంగా గృహా లను నిర్మించుకున్న కొంత మంది లబ్దిదారు లకు అసలే బిల్లులు గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని వాపోయారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు హన్మండ్లు, నాయకు లు మోహన్‌రెడ్డి, కొండ ప్రభు, శివకుమార్, బోడ్ల రాజు పాల్గొన్నారు

### బీర్కూర్‌లో రేషన్ షాపు ప్రారంభం

**బీర్కూర్:** మండల కేంద్రంలోని గడికింది కాలనీలో కొత్తగా రేషన్‌షాపు ఏర్పాటు చేశారు. బీర్కూర్‌కు చెందిన కవిత అనే మహిళకు అధికారులు ఈ రేషన్ షాపు కేటాయించారు. ఇదిలా ఉండగా ఏఎంసీ వైస్ చైర్మన్ రాములు



రేషన్ బియ్యాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

మంగళవారం రేషన్ దుకాణాన్ని ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయ కులు, లబ్దిదారులు తది తరులు పాల్గొన్నారు.

**బిచ్కుంద:**తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పేదప్రజలకు అనుకులమైన ప్రజాప్రభుత్వ పాలన సాగిస్తున్నారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నూతన రేషన్‌దుకాణాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్‌దుకాణాల ద్వారా త్వరలోనే లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.డీలర్‌లు పంపిణీ విషయంలో అశ్రద్ద వహించరాదని సూచించారు. ప్రతిపక్షాలు అసత్యప్రచారాలు చేస్తు ప్రజలలో మరింత చులకన అవుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ సభ్యులు విఠల్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, పార్టీ అధ్యక్షుడు గంగాధర్, గోపాల్‌రెడ్డి, అశోక్,హన్మంత్‌రావుదేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

**● జుక్కల నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతా :ఎమ్మెల్యే**

**మద్నూర్:** జుక్కల్ నియోకజకవర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడానికి తనవంతు శాయశక్తులా కృషిచేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో విలేకరుతో మాట్లాడారు. కామారెడ్డి జిల్లాకు మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండల కేంద్రంలోని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈనెల 5న రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అదే రోజు మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపికైన సౌజన్య, కార్యవర్గ సభ్యులకు పదవి ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యాపరంగా వెనుకబడి ఉన్న జుక్కల్ నియోజకవర్గానికి అన్ని రంగాలతో పాటు విద్యారంగానికి ప్రత్యేకంగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని అన్నారు. జుక్కల్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సంబంధిత మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాఠశాల ఏర్పాటుతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పోరేట్ స్థాయి విద్యను అందించే అవకాశం నియోజకవర్గానికి వచ్చిందని అన్నారు. మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుట్ట ప్రాంతంలో స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పాఠశాలలో 2560 మంది విద్యార్థులకు విద్యాబోధన అందించే అవకాశం ఉంటుందని విద్యార్థులు నాలుగవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకోవచ్చు అని తెలిపారు. ఈ పాఠశాల లైబ్రరీలో ఐదు వేల పుస్తకాలు కంప్యూటర్ కేంద్రంలో 60 కంప్యూటర్లు ఉండ నున్నట్లు వెల్లడించారు. ఆయా తరగతి గదుల్లో డిజిటల్ బోర్డుల ద్వారా విద్యాబోధనలు చేస్తారని గుర్తు చేశారు. అత్యాధునిక విద్యా ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూ ల్ ఏర్పాటు అవుతుందని రాష్ట్రంలో నియోజక వర్గంలోని మద్నూర్ మండలానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందని అన్నారు. ఆయనతో పాటు మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్య రమేష్, ఉపాధ్యక్షులు పరమేష్‌పటేల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిలు, నాయకులు, సాయి పటేల్, హన్మాండ్లు, స్వామి, రామ్ పటేల్, రమేష్, కొండ గంగాధర్ తదితరులు ఉన్నారు.

# కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రామారెడ్డి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో మార్గశిర తొలి మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిలో పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్చరణలతో పాలాభిషేకం, సింధూర ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైభవంగా ప్రత్యేక క్యూ లైన్ ద్వారా భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే విధంగా కొందరు వివిధ రకాల పూజలు నిర్వహించారు. కామారెడ్డి జిల్లాతో పాటు పలు జిల్లాల భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు. అనంతరం శనేశ్వర, నాగదేవత, శివాలయం, నవగ్రహాల గుడి దేవుళ్ళకు మొక్కులు మొక్కి పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయం వెనుక ఆవరణలో గల బావి నీటితో స్నానాలు చేసి తడి బట్టలతో భైరవున్ని గర్భగుడిలో తడి పూజలు నిర్వహించారు. భక్తులకు ఉచితంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్ల ప్రభు రాంచంద్రం



శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో వైభవంగా సింధూర పూజలు

గుప్తా, ఎస్ఐ నరేష్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, ఆలయ సిబ్బంది నాగరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# టీజీవో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డిటౌన్,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్,ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్యాంకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దేవేందర్, అసోసియేట్ అధ్యక్షుడిగా సుభాష్, ఉపాధ్యాక్షులుగా నీలంలింగం, రాజలింగం,సంతోషిరెడ్డి,ప్రధాన కార్యదర్శిగా సాయిరెడ్డి,సహాయ కార్యదర్శులుగా రమేష్, నర్సింలు, జ్యోతి,కోశాధికారిగా భూమయ్య,ఆర్గనైజింగ్ సెక్రటరీగా నిజాం, పబ్లిసిటి సెక్రటరిగా మౌనిక రెడ్డి, ఆఫీస్ సెక్రటరిగా శ్రీనివాస్‌స్వామి,కల్చరల్ ప్రెసిడెంట్‌గా ప్రశాంత్‌రెడ్డి,స్పోర్ట్ అండ్ గేమ్స్ సెక్రటరిగా సుదాకర్, కార్యనిర్వహకసభ్యులుగా తురాబుద్దిన్, ఠాకుర్, శశికిరణ్,సవిత రెడ్డిలతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలు త్వరలో పీఆర్‌సీని కూడా ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఉద్యోగుల హెల్త్‌కార్డులు వివిద కార్యాలయాలలో పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, పెండింగ్‌బిల్లులు,సీపీఎస్ రద్దు విషయాలలో ప్రభుత్వంతో చర్చలు జరిపి త్వరితగతిన అన్ని పెండింగ్ సమస్యలు పరిష్కరించుటకు చర్యలు చేపడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీజీఓ రాష్ట్రకోశాధికారి ఉపేందర్‌రెడ్డి, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు కిషన్, కామారెడ్డి టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి సాయిలు,ఆర్‌టీఓ శ్రీనివాస్‌రెడ్డి,ఎస్‌సీకార్పోరేషన్ ఈడీ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

### మొబైల్ లింకులు టచ్ చేయొద్దు : ఎస్సై

లింగంపేట, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : మొబైల్‌లో వచ్చే అన్ని రకాల లింకులను ఎట్టి పరిస్థితిలోను ఓపెన్ చేయవద్దని, ఎవరికి ఓటీపీలు చెప్పి మోసపోవద్దని లింగంపేట ఎస్సై సుధాకర్ అన్నారు. ఆయన మంగళవారం లింగంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్, వాహన డ్రైవింగ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్ల ప్రజలను అనేక రకాలుగా మోసాలు చేసి డబ్బులు కాజేస్తున్నారని మొబైల్‌కు కొన్ని రకాల లింకులను పంపుతారని వాటిని ఓపెన్ చేయగానే మన ఫోన్ పూర్తిగా వారి ఆదీనంలోకి వెళ్లుతుందని ఫోన్‌లోని సమాచారం అంతా వారికి తెలిసిపోతుందని దాంతో మన ఫోన్ పే, గుగుల్ పేలను వారు వాడుకుని మన అకౌంట్‌లోని డబ్బులను కాజేస్తారని ఆయన తెలియజేశారు. సర్వేలో తప్పులు ఉన్నాయి, మీ అకౌంట్ బ్లాక్ అయింది అంటు ఫోన్‌చేసి ఓటీపీలు అడుగుతారని అలాంటి వారికి ఎవరికి ఓటీపీలు చెప్పవద్దని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, కానిస్టేబుల్స్ రాజు, పెంటయ్య, లెక్చరర్లు శివ, రాజయ్య, నాగు, స్వామిగౌడ్, దర్‌సింగ్, వాణిలతో పాటు సిబ్బంది ఉన్నారు.

### కాంగ్రెస్‌పార్టీవి మోసపూరిత వాగ్దానాలు : అరుణతార

బిచ్కుంద,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ప్రభుత్వ పాలనలో విసుగుచెందని ప్రజలు కాంగ్రెస్‌పార్టీ మోసపూరిత వాగ్దానాలు నమ్మి మోసపోయారని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ 6 అబద్దాలు...66మోసాలు కరపత్రాలను విడుదలచేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు అధికారాన్ని కట్టబెడితే నోటికొచ్చిన వాగ్దానాలతో ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టడమే కాకుండా ఇచ్చిన హామీలు గాలికి వదిలారని విమర్శించారు.వితంతుపించన్, ఇందిరమ్మ ఇల్లు,గృహాజ్యోతి, 500కే గ్యాస్‌సిలిండర్,మహిళలకు రూ.2500భృతి ఇలా అనేక హామీలను అమలుచేయడంలో విఫలమయ్యారని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లికార్జున్‌దేశాయ్, శివాజీపటేల్, నరేష్, జిల్లా ప్రధానకార్యదర్శి రాము, బీజేవైయం నాయకుడు విష్ణు,విఠల్ తదితరులు పాల్గొన్నారు.

### 5న సీనియర్ ఇంటర్‌డిస్ట్రిక్ కబడ్డీ ఎంపికలు

కామారెడ్డిటౌన్,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):71 వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ కబడ్డి ఛాంపియన్‌షిప్ పోటిలలో భాగంగా ఈనెల 5 న కామారెడ్డి లయోల ఉన్నత పాఠశాలలో ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డి అసోసియేషన్ ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఇందులో ఎంపికైన వారు ఈనెల 7 నుంచి 10 వరకు హైదరాబాద్‌లో జరిగే పోటిలలో పాల్గొంటారని తెలిపారు. పోటిలలో పాల్గొనే అభ్యర్థులు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాణాల భాస్కర్‌రెడ్డికి మధ్యాహ్నం 2గంటలలోగా రిపోర్టుచేయాలని తెలిపారు. అభ్యర్థుల బరువు 75కిలోల లోపల ఉండాలని సూచించారు.

### కాంగ్రెస్ 6 అబద్దాలు.. 66 మోసాలపై చార్జిషీట్

మాచారెడ్డి,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):పాల్వంచ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ 6 అబద్దాలు 66 మోసాలపై ఛార్జిషిట్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్న అభివృద్ది శూన్యమని అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చారని అన్నారు. ఇక మీదనైన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు తెలుపుతామన్నారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బాలరాజు, మాజీ జిల్లా కార్యవర్గసభ్యులు శ్రీనివాస్‌గౌడ్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్,యువమోర్చా అధ్యక్షుడు రాహుల్,ఓబీసీమోర్చా మండల అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి చూపు పరీక్షలు

రామారెడ్డి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):విద్యార్థిని, విద్యార్థులకు కంటి చూపు మంచిగా ఉంటేనే అన్నిట్లో ముందు ఉంటారని కంటి వైద్యులు డాక్టర్ బి.హరికృష్ణ రావు పేర్కొన్నారు. రామారెడ్డి మండలం సింగిరాయిపల్లి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు విద్యార్థిని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పోటీతత్వంతో చదవాలని, తల్లిదండ్రుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పలు సలహాలు, సూచనలు, పద్దతులను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మామిడ్ల మారుతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మ, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులుపాల్గొన్నారు.

### పోలింగ్ బూత్‌ల పరిశీలన

రాజంపేట,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని 18 గ్రామాలలో సోమవారం పోలింగ్ బూత్‌లను ఎంపీడీఓ రఘురాం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సర్పంచ్ ఎన్నికల నిమిత్తం పోలీంగ్ బూత్‌లను పరిశీలించామని తెలిపారు. నీటి సదుపాయాలు, విద్యుత్‌సదుపాయాలు పరిశీలించి సౌకర్యాలు లేని వాటిని చేయించాలని సంబంధిత అధికారులకు తెలియజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి మున్నూరుకాపుల విరాళం

లింగంపేట, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలోని చారిత్రక పురాతన ఆలయం మత్తడి పోచమ్మ ఆలయ నిర్మాణానికి లింగంపేట మండల కేంద్రంలోని మున్నూరుకాపులు మంగవారం రూ.111111లు విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణానికి ఆలయ కమిటీతో పాటు గ్రామస్తులు విరాళాలు సేకరిస్తుండగా గ్రామస్తులు అమ్మవారి ఆలయ నిర్మాణానికి కులమతాలకు అతీతంగా పోటీ పడి విరాళాలు ఇస్తున్నారు. ప్రభుత్వం అమ్మవారి ఆలయం వరకు రోడ్డు నిర్మాణానకి రూ.కోటి మంజూరు చేసిందని ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్ తెలిపారు. కార్యక్రమంలో ఆకుల సంగయ్య, చందు, కొడ రవి, కాంతం, శంకర్‌గౌడ్, నర్సింలు, భైరయ్య, మారుతిలతో పాటు ఆలయకమిటి సభ్యులు ఉన్నారు.

### బీఆర్‌ఎస్‌వీ నాయకుల గురుకులబాట

కామారెడ్డిటౌన్,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో మంగళవారం గురుకుల బాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీకళాశాల, మైనార్టీ జూనియర్ కళాశాలను పరిశీలించారు.అనంతర సరంపల్లి వద్ద ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలోకి వెళ్లెందుకు ప్రయత్నించగా సిబ్బంది అడ్డుతెలిపారు. దీంతో విద్యార్థి సంఘనాయకులు అక్కడే కూర్చోని నిరసన తెలిపారు. అక్కడి దేవునిపల్లి పోలీసులు చేరుకుని వారిని అక్కడి నుంచి పంపించి వేశారు.ఈ సందర్భంగా టీఆర్‌ఎస్‌వీ ప్రధానకార్యదర్శి జిల్లా ఇంచార్జ్ హరీష్,బీఆర్ఎస్ యూత్ టౌన్‌ప్రెసిడెంట్ భానుప్రసాద్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నిరంకుశ పాలనలో గురుకులాల విద్యార్థులు చనిపోతున్న పట్టించుకోకుండా విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులపై దౌర్జన్యం చేయడం తగదని అన్నారు. ఇప్పటివరకు గురుకులాల్లో 50కి పైగా విద్యార్థులు చనిపోతుంటే పట్టించుకోకుండా విద్యారంగంపై కనీస సమీక్ష చేయడం లేదని త్వరలో కాంగ్రెస్‌పార్టీకి తగిన బుద్దిచెప్పెందుకు ప్రజలు సిద్దమవుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మారుతి,శ్రీను, సాయి,బుల్లెట్, పరుశురాంగౌడ్, సాయికృష్ణ,వినయ్ తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తులకు ఆహ్వానం

దోమకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):దోమకొండ మండలంలోని సీతారాంపల్లి కేజీబీవీలో గెస్ట్ టీచర్ల నియామకం చేపట్టడం జరుగుతుందని ప్రిన్సిపాల్ మంగమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల స్థాయిలో పీజీసీఆర్‌టీ కేమిస్ట్రీ, అర్హత బీఈడీ, పీజీ దరఖాస్తులకు చివరి తేదీ 5వరకు, పదవి కాలం ఈ విద్య సంవత్సరం మాత్రమే అన్నారు. దరఖాస్తులు కేజీబీవీ దోమకొండ నందు స్వీకరించబడునని తెలిపారు. డెమో 5నాడు 4గంటలకు నిర్వహించి, రిజల్ట్ అదే రోజు ప్రకటించడం జరుగుతుందన్నారు. సెలక్ట్ అయిన వారు 6న జాయినింగ్ కావాలని సూచించారు.

### ఓపెన్ స్కూల్ స్పెషల్ అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

భిక్కనూరు, డిసెంబరు 03(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ స్పెషల్ అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భిక్కనూరు ఎంఈవో రాజ్ గంగారెడ్డి అన్నారు. మంగళవారం భిక్కనూరు జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో ఓపెన్ స్కూల్ స్పెషల్ అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన ఎవరైనా ఓపెన్ స్కూల్ విధానంలో పదవతరగతి అడ్మిషన్ పొందవచ్చునని, ఓపెన్ స్కూల్‌లో బాగంగా పదవతరగతి పరిక్ష పాసైనా వారు ఇంటర్మిడియేట్‌లో అడ్మిషన్ తీసుకోవచ్చునని, ప్రతి దానిలో రెగ్యూలర్ విద్యార్థులతో సమానంగా ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పదో తరగతి చదువుకోవాలనుకునే వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, నోడల్ అధికారి శ్రీనాథ్, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ తుల రవీందర్, ఆయాపాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేడు దోమకొండ బైక్‌ల వేలంపాట

దోమకొండ, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): అబ్కారీ శాఖ తనిఖీల్లో పట్టుబడిన 2 బైక్‌లను మండల కేంద్రంలోని అబ్కారీ కార్యాలయంలో వేలంపాటను బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని అబ్కారీ సిఐ మధుసుదన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిక్తి గల వారు ఆప్‌సెట్ ధరలో 25 శాతం ఈఎండీ చెల్లించి టెండర్‌లో పాల్గొన వచ్చన్నారు. 18శాతం జీఎస్‌టీ అదనంగా వర్తిస్తుందన్నారు.

## మదన్‌మోహన్‌కు మంత్రి పదవి రావాలని పూజలు

లింగంపేట, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు మంత్రి వర్గ విస్తరణలో మంత్రి పదవి రావాలని కోరుతూ లింగంపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మహారాష్ట్రలోని తులా భవాని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. చాలా కాలంగా వెనుకబడిన ఎల్లారెడ్డి నియోజకవర్గానికి మంత్రి పదవి వస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం 50సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉందని మదన్‌మోహన్‌కు మంత్రి పదవి వస్తే కార్యకర్తలకు అండగా ఉంటారని వారు తెలిపారు. వెళ్లిన వారిలో కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, నాయకులు సాయికుమర్, రాజు, రామాగౌడ్, రమేష్‌లతో పాటు నాయకులు ఉన్నారు.



తుల్జాభవాని ఆలయంలో పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు



## చికెన్ ధరలు



| రకం | | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|---|
| సుగుణ (కిలో) | : | 140 | 180 | 200 |
| వెన్‌కాబ్(కిలో) | : | 130 | 160 | 190 |

